గోల్కొండ డిగ్రీ మహిళా కళాశాలలో అడ్మిషన్ డ్రైవ్

పోస్టర్‌ను విడుదల చేస్తున్న ప్రధానాచార్యులు మాధవి, లక్ష్మి

మెహదీపట్నం, ఫిబ్రవరి 27 : ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల గోల్కొండ అడ్మిషన్ డ్రైవ్‌ను బీజేఆర్ గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో నిర్వహించడం జరిగింది. దీనిలో భాగంగా కళాశాలలో ఉన్నటువంటి వివిధ రకాలైన కోర్సు లు,అనుభవజ్ఞులైన అధ్యాపకులు మరియు వసతుల గురించి విద్యార్థులకు తెలియజేస్తూ పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా బీజేఆర్ కళాశాల ప్రధానాచార్యులు జి.మాధవి, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు లక్ష్మి , వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హుమేరా సయీద్, అకాడమిక్ కోఆర్డినేటర్ ఎన్.ఎస్. రజనీశ్, కోఆర్డినేటర్ రజిని, బి.సుచేత అధ్యాపక బృందం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు మెరుగు పర్చేందుకు స్కిల్ సెంటర్లు దోహదం

యువతకు ఉపా ధి అవకాశాలు మెరుగుపపర్చేందుకు స్కిల్ సెంటర్లు దోహదం చేస్తాయని నాంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మమ్మద్ మజీద్ హుస్సేన్ అన్నారు. మల్లేపల్లి లో ఏర్పాటు చేసిన స్కిల్ సెంటర్ ను ఎమ్మెల్యే మాజీద్ ఉస్సేన్, ఎంఐఎం నాయకుడు జాఫర్ ఖాన్ తో కలిసి ప్రారంభించారు. సందర్భంగా మాజీద్ హుస్సేన్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులకు స్వయం ఉపాధి కోసం శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు.

– మెహిదిపట్నం, ఫిబ్రవరి 27

డంపింగ్ యార్డు స్థలంలో కమ్యూనిటీహాల్ నిర్మించాలి

అంబర్‌పేట, ఫిబ్రవరి 27: బాగ్‌అంబర్‌పేట డివిజన్ బతుకమ్మకుంట పాత చెత్త డంపింగ్ యార్డు స్థలంలో కమ్యూనిటీహాల్ ను నిర్మించాలని చుట్టుపక్కల బస్తీల ప్రజలు జీహెచ్ఎంసీ అధికారులకు విన్నవించారు. కొన్నేండ్ల నుంచి తమకు ఫంక్షన్లు, సమావేశాలు నిర్వహించుకునేందుకు ఎలాంటి కమ్యూనిటీహాల్ అందుబాటులో లేనందని అన్నారు. పాత డంపింగ్ యార్డు స్థలంలో దీన్ని కట్టించాలని విజ్ఞప్తి చేశారు.

పాత డంపింగ్ యార్డు స్థలం ఇదే

బతుకమ్మకుంట చుట్టుపక్కల సాయిమధురానగర్, శ్రీనివాస్ స్కూల్ లేన్, బతుకమ్మకుంట కట్ట, గుడి గల్లీ తదితర ప్రాంతాలలో సుమారు 500 వరకు ఇండ్లు ఉంటాయి. మొత్తం జనాభా 4,000వేల వరకు ఉంటుంది. చాలా వరకు ఇక్కడ పేదలు నివాసముంటున్నారు. ఈ ప్రాంతంలో అన్నీ చిన్న చిన్న ఇండ్లు ఉండడంతో ఏదైనా ఫంక్షన్ చేద్దామన్నా చోటు లేదు. బస్తీ సమావేశాలు ఏర్పాటు చేసుకుందామన్నా స్థలం లేదు. దీంతో గత 20 సంవత్సరాలుగా ఆయా బస్తీల ప్రజలు తమకు ఒక కమ్యూనిటీహాల్ కట్టించాలని అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు. వినతిపత్రాలు కూడా ఇచ్చారు. ప్రస్తుత కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అంబర్‌పేట ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కూడా విన్నవించారు. అయితే అప్పట్లో స్థానిక శ్రీరమణ కేంద్రం వద్ద సమోసా ఆకారంలో ఉన్న ఒక స్థలాన్ని గుర్తించి అక్కడ కమ్యూనిటీహాల్ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. బోర్ కూడా వేశారు. కానీ ఆ ప్రతిపాదన అర్థంతరంగా ఆగిపోయింది. దీంతో ఆయా బస్తీల ప్రజలు నిరాశే ఎదురైంది. అప్పటి నుంచి కమ్యూనిటీహాల్ కోసం వీళ్లు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అధికారులతో పాటు స్థానిక ఎమ్మెల్యే దృష్టికి కూడా తీసుకెళ్లారు. ఇక్కడ పాత చెత్త డంపింగ్ యార్డు స్థలం ఖాళీగా ఉందని దానిలో కమ్యూనిటీ హాల్ నిర్మించి వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు. అక్కడ కమ్యూనిటీహాల్ కట్టించి ఇవ్వాలని స్థానిక బస్తీ పెద్దలు శ్రీహరి అడ్వకేట్, ట్యూషన్ శేఖర్, జె. బాలరాజు, ఆర్.రమేశ్ తదితరులు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మించి సాయం చేయాలి

స్థానికంగా అన్ని చిన్న చిన్న ఇండ్లే ఉండటంతో ఏదైనా ఫంక్షన్ చేద్దామంటే స్థలం లేదు. దీంతో చాలా ఉబ్బందులకు గురి కావల్సి వస్తున్నది. దీనిని దృష్టి ఉంచుకొని నిరుపయోగంగా ఉన్న పాత డపింగ్‌యార్డ్ స్థలంలో ఫంక్షన్‌హాల్‌ను నిర్మిస్తే అందరికీ ఉపయోగ కరంగా ఉంటుంది. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, అధికారులు దృష్టిసారించి కమ్యూనిటీ హాల్ నిర్మించి మాకు సాయం చేయాలి.

– అరుణ, స్థానికురాలు

నూతన కార్యవర్గం

సుల్తాన్ బజార్,ఫిబ్రవరి 27: ది ఇన్‌స్టిట్యూట్ అఫ్ ఛార్టర్డ్ అకౌంట్స్ అఫ్ ఇండియా సదరన్ రీజినల్ కౌన్సిల్ , హైదరాబాద్ శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం రెడ్ హిల్స్‌లోని సంస్థ కార్యాలయంలో నిర్వహించిన మేనేజింగ్ కమిటీ సమావేశం లో 2025-2026 సంవత్సరానికి గాను చైర్మన్ గా సి.ఎ. చిన్న సీతారామిరెడ్డి అన్నపురెడ్డి , వైస్ చైర్మన్‌గా సి.ఎ. గింధారి లాల్ తోష్నివార్, కార్యదర్శిగా కారుమంచి రామారావు , కోశాధికారిగా నాగ హర్షవర్ధన్ రెడ్డి శీలం, ముక్కర సాయి చరణ్‌రెడ్డి సికాస చైర్మన్ గాను , గోనుగుంట మురళి సికాస కో చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు ఉప్పలపాటి శరణ్ కుమార్ , కుమార్ పాల్ టాటెడ్ , శైలేష్ ఖండేల్ వాల్ లు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సమావేశానికి ఐ సీ ఏ ఐ సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు దయచివాస్ శర్మ , ముప్పాళ్ల శ్రీధర్ మరియు రీజినల్ కౌన్సిల్ సభ్యలు భాను నారాయణ రావు, చెంగల్ రెడ్డి , సునీల్ కుమార్ మండవ, యర్రా తిరుపతయ్య, దీపక్ లడ్డా తదితరులు పాల్గొన్నారు. గత కమిటీ సభ్యులు సంస్థ కు అందించిన విశిష్ట సేవలను కొనియాడారు . అనంతరం వారిని ఘనంగా సత్కరించి గౌరవించారు.

ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ ఎకౌంట్స్ ఆఫ్ ఇండియా సదరన్ రీజిన ల్ కౌన్సిల్ చైర్మన్ గా బాధ్యతలను స్వీకరిస్తున్న సీఏ చిన్న సీతారాం రెడ్డి అన్నపురెడ్డి, కౌన్సిల్ నూతన కార్యవర్గం

ఎంఎన్‌జే దవా ఖానలో అన్నదానం

ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖానలో రోగి సహాయకులకు అన్నదానం చేస్తున్న అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఎస్. ఎం. ముజీబ్ హుస్సేనీ

సుల్తాన్ బజార్, ఫిబ్రవరి 27: ప్రభుత్వ దవా ఖానలలో వైద్య చికిత్సలు పొందే పేద రోగి సహాయకులకు అన్నదాన వితరణ చేపట్టడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం. ముజీబ్ హుస్సేనీ అన్నారు. గురువారం మెహదీ నవాబ్ జంగ్ (ఎంఎన్‌జే) క్యాన్సర్ దవాఖాన ఆవరణలో అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు 800 నిరుపేద రోగుల సహాయకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కేంద్ర సంఘ అధ్యక్షులు శ్రీ మారం జగదీశ్వర్ , అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకట్ లతో కలిసి ఆయన పేద రోగి సహాయకులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మారం జగదీశ్వర్ మాట్లాడుతూ.. కీర్తిశేషులైన తల్లిదండ్రుల పేరిట ముజీబ్ హుస్సేనీ వివిధ కార్యక్రమాలు చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు. టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ముజీబ్ హుస్సేనీ మాట్లాడుతూ నెలలో నాలుగు సార్లు పేద రోగి సహాయకులకు అన్నదాన వితరణ చేయడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఈ విషయంలో తాను భగవంతునికి సదా రుణపడి ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ అసోసియేట్ అధ్యక్షులు కె.ఆర్.రాజ్ కుమార్, ఏపీఆర్వో వహీద్, మహమ్మద్ హబీబ్ చావుశ్, మహమ్మద్ అబ్దుల్ ముస్తఫా, మాజీ సభ్యుడు జగదీశ్, ఎం.ఎన్.జి. యూనిట్ సభ్యులు చంద్రశేఖర్, మిత్రులు ఉస్మాన్ అలీ ఉస్మాని తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పని చేసినప్పుడే గుర్తింపు

సురేశ్‌కుమార్ దంపతులను సత్కరించిన ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి ఒడ్డెన్న, రాష్ట్ర జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేశ్‌కుమార్ తదితరులు

కాచిగూడ, ఫిబ్రవరి 27: విధి నిర్వహణ, అంకితభావంతో పనిచేసినప్పుడే ప్రజల్లో మంచి గుర్తింపు ఉంటుందని హైదరాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి ఒడ్డెన్న అన్నారు. కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల లైబ్రేరియన్‌గా ఉద్యోగ విరమణ చేసిన కె. సురేశ్ కుమార్ సన్మాన కార్యక్రమాన్ని గురువారం కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులు పాల్గొని సురేశ్‌కుమార్ దంపతులను ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా విద్యాశాఖ అధికారి ఒడ్డెన్న హాజరై మాట్లాడుతూ కళాశాలలో సేవలు అందించి, తోటి ఉద్యోగుల మన్నలను పొందడం గొప్ప విషయ మన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేశ్‌కుమార్, కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిరంజీవి, తెలంగాణ లైబ్రేరియన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శివకుమార్, రాష్ట్ర జూనియర్ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి. లక్ష్మయ్య గంగపుత్ర, వి.ప్రసాద్ రావు, బాలయ్య, గీతాబాయి, రామ్మోహన్, అనిల్ రెడ్డి, రజని, బాలమణి, రాజేందర్ పాల్గొన్నారు.

డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్‌కు సన్మానం

రాజ్‌నారాయణ ముదిరాజ్‌ను సన్మానిస్తున్న వక్తలు

అబిడ్స్, మార్చి 27 : ప్రపంచ స్వచ్ఛంద సంస్థల దినోత్సవం సందర్భంగా డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్‌కు టీఎన్జీవోస్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో సన్మానం జరిగింది. ఈ సందర్భంగా టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌మాట్లాడుతూ సమాజ సేవలో డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్ చేస్తున్న సేవలు అమోఘమన్నారు. ప్రపంచ స్వచ్ఛంద సేవా సంస్థ దినోత్సవం సందర్భంగా నాంపల్లిలోని టీఎన్జీవో సెంట్రల్ ఆఫీసులో రాజ్‌నారాయణ ముదిరాజ్ సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. శాలువా పూలమాల జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ స్వచ్ఛంద సంస్థను స్థాపించి 1985 నుంచి నిర్విరామంగా సేవలందిస్తున్నందుకు ఆయన సేవలను గుర్తించి ఈ సన్మానం చేశామని అన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఎన్నో కార్యక్రమాలు చేసి అందరి మన్ననలను పొందారని గుర్తు చేశారు. టీఎన్జీఎస్ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ముజీబ్ హుస్సేన్ మాట్లాడుతూ ఎన్నో కార్యక్రమాలు నిర్విరామంగా నిర్వహిస్తున్న రాజనారాయణ ముదిరాజ్ సేవలను అమెరికా యూనివర్సిటీ గుర్తించి సన్మానించిందని అన్నారు.

చండీ హోమం.. అన్నదానం

నల్ల పోచమ్మ ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న ఎన్. ఆర్. లక్ష్మణరావు తదితరులు

అబిడ్స్, ఫిబ్రవరి 27 : అమావాస్య సందర్భంగా కోటి రాణి పార్కు సమీపంలోని నల్ల పోచమ్మ ఆలయంలో చండీ హోమం నిర్వహించారు. ప్రపంచ శాంతి కోసం చండీ దేవి ఆశీస్సులు కోరుతూ పవిత్రమైన ఆచారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. హోమం అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. బజరంగ్ సేన తెలంగాణ అధ్యక్షుడు లక్ష్మణ్ రావు పాల్గొని అన్నప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభు, శ్రీకాంత్, రవి, నరేశ్, ఆశిశ్, పవన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

చరణదాసు జానపదనాటకం

చరణదాసు జానపద నాటకంలో.. కళాకారులు

రవీంద్రభారతి, ఫిబ్రవరి 27 : రసరంజని హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో భూమిక థియేటర్స్ గ్రూప్ హైదరాబాద్ వారు సమర్పించు చరణదాసు జానపద నాటకం గురువారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ నాటకానికి పాటలు, డిజైన్, దర్శకత్వం ఉదయ్‌భాను గరికపాటి, మూలనాటకం హబీబ్ తన్వీర్ వహించిన ఈ నాటకం నాటక కళాకారులు చాలా అద్భుతంగా చరణదాసు జానపద నాటకంలో నటించి ప్రేక్షకులను రంజింపచేశారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా మాజీ ఐఎఎస్ అధికారి, పూర్వ ప్రభుత్వ సలహాదారుడు కె.వి. రమణాచారి విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి నాటకాన్ని ప్రారంభించి తిలకించారు. కథా సంగ్రహణం, చరణదాసు మంచి దొంగ, దోచుకున్న సొమ్ము పంచే దొంగ? దొరల్లో దొంగను చూపెట్టే దంగ.. రెండు కాళ్ల నడక లాంటిదే మంచి చెడులు కలిసిన నడత. ఈ మనుగడలో వెలుగు చీకటి ఉంటూనే ఉంటాయి. జానపద కథ ఆధారంగా హబీబ్ తన్వీర్ తీర్చి దిద్దిన ఈ నాటకంతో నవ్వు కలిపిన కషాయాన్ని తాగిస్తాయి. ఈ కార్యక్రమం రసరంజని కన్వీనర్ నటరాజ్, ప్రధాన కార్యదర్శి రామకోటేశ్వరరావు, సేనాపతి తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో రైలు ఢీకొని ఇద్దరు మృతి

కాచిగూడ, ఫిబ్రవరి 27: రైలు ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వృద్ధుడు (60) గురువారం ఉప్పుగూడ-యాకుత్‌పురా రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాడుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో ఆ వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా దావాఖానకు తరలించారు. వృద్ధుని ఉంటి పై తెలుపు, నలుపు చొక్క, నలుపు రంగు పాయింటు ధరించి, ఎత్తు 5.5 ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని తెలిపారు.

పట్టాలు దాటుతూ ..

పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ హెడ్ కానిస్టేబుల్ చిమ్నా నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి (55) గురువారం ఫలక్‌నుమా-శివరాంపల్లి రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దావాఖానకు తరలించారు. వివరాలకు 8712 568495లో సంప్రదించాలని కోరారు.

స్పెషల్ రైలో దొంగతనం

కాచిగూడ, ఫిబ్రవరి 27: కాచిగూడ స్పెషల్ రైల్లో ప్రయాణికురాలి బంగారు ఆభరణాలు, నగదు గుర్తుతెలియని వ్యక్తులు దుంగిలించారు. రైల్వే ఇన్స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు శ్వేత శర్మ (35) కాచిగూడకు వస్తుండగా ఉమ్రీ రైల్వే స్టేషన్లో బ్యాగు చూసుకోగా అందులో ఉన్న 25 గ్రాముల బంగారు ఆభరణాలు, నగదు 6,000/- ల్యాప్టాప్, మూడు సెల్ ఫోన్లు, ఖరీదైన గడియారం, కనిపించలేదు. బాధితురాలు గురువారం కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు రైల్వే సీఐ తెలిపారు.

దేవాదాయ పరిధిలోకి భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం

చార్మినార్ వద్ద ఉన్న భాగ్యలక్ష్మిఅమ్మవారి ఆలయం

చార్మినార్, ఫిబ్రవరి 26: చారిత్రక చార్మినార్ వద్ద ఉన్న భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయ నిర్వహణపై ట్రిబ్యునల్ సంచలనాత్మక తీర్పును వెలువరించింది. ప్రస్తుతం భాగ్యలక్ష్మి అమవారి ఆలయ పర్యవేక్షణ చేస్తున్న ట్రస్టీ నుంచి స్వాధీనం చేసుకుని దేవాదాయశాఖ అధీనంలో పర్యవేక్షణ కొనసాగించాలని ట్రిబ్యునల్ గురువారం తీర్పును వెల్లడించింది. ప్రస్తుతం భాగ్య లక్ష్మి ఆలయ నిర్వహణ బాధ్యతను మహంత్ మనోహర్ దాసు, మహంత్ రాంచంద్ర దాసు 1960 దశకం నుంచి చూస్తున్నారు. ఇప్పుడు నిర్వహణ బాధ్యతలను దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకువచ్చేందుకు ఆదేశాలు వెలువడ్డాయి. ఈ ఆలయానికి తక్షణమే ఈఓ ను నియమించి ఆలయంలోఎటువంటి అవకతవకలు జరుగకుండా ముందుకు వెళ్లాలని దేవాదాయ శాఖ కమిషనర్‌ను ట్రిబ్యునల్ ఆదేశించింది. ఈ ఆలయ ఆదాయాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్న ఫిర్యాదులపై కోర్టు విచారణ అనంతరం ఈ ఆదేశాలు జారీ చేసింది. చార్మినార్ వద్దనున్న అమ్మవారి ఆలయ సమీపంలో గతంలో బస్సు ప్రమాదం చోటు చేసుకున్నది. ఈ ప్రమాదంలో అమ్మవారి విగ్రహం దెబ్బతినందంతో పునర్నిర్మాణం కోసం స్థానిక భక్తులు విరాళాలు సేకరించి అమ్మవారి విగ్రహాన్ని తిరిగి ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి భాగ్యలక్ష్మి ఆలయం మార్చినట్లు కథనం. ఆలయ నిర్వహణ బాధ్యతలు చూసే మహంత్ రాంచంద్ర దాసు, రాజ్‌మోహన్ దాసు అనే వ్యక్తిని పూజారిగా నియమించారు. టెంపుల్ ట్రస్టీ మీద గతంలో ఉన్న సుప్రీంకోర్టు తీర్పు కారణంగా ఆలయాన్ని తన ఆధీనంలోకి తీసుకొని ఆదాయాన్ని రాజ్ మోహన్ దాసు ఒక్కరే అనుభవిస్తూ వచ్చారు. రాంచంద్ర దాసు కుమార్తె భాగ్యలక్ష్మి ఆలయంపై అజామాయిషీ చేస్తున్నందున వారిపై కోర్టును ఆశ్రయించారు. కోట్లాది రూపాయల ఆలయ నిధులను ప్రస్తుత నిర్వాహకులు దుర్వినియోగం చేస్తున్నట్లు సాక్ష్యాధారాలను కూడా ట్రిబ్యునల్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆలయాన్ని దేవాదాయ శాఖకు అప్పగించాలని తీర్పు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలు

శివ మహా జాగరణలో పాల్గొన్న భక్తులు

అబిడ్స్, ఫిబ్రవరి 27: కాగజ్ గూడ శంకర్ జి హనుమాన్ జి కల్యాణ మండపంలో మహాశివరాత్రి వేడుకలు ముగిశాయి ప్రతి సంవత్సరం శివరాత్రి సందర్భంగా శ్రీ శివ మహా జాగరణ మహోత్సవాన్ని నిర్వహించడం తోపాటు అన్నదాన కార్యక్రమాన్ని చేపడతారు. ఇందు లో భాగం గా శ్రీ మహా శివరాత్రి జాగరణ సేవా సమితి అ ధ్యక్షుడు మాడిశెట్టి సదానందం గుప్తా ఆధ్వర్యంలో జాగరణ కార్యక్రమాన్ని వేలాదిమంది భక్తుల తో కలిసి అత్యంత ఘనంగా నిర్వహించారు. వివిధ దేవతా మూర్తులు ప్రత్యేక పూజల అనంతరం మా వైష్ణో జాగరణ మండలి ద్వారా భజనలు కొనశాగాయి. ప్రముఖ గాయకులు సి. రాజన్ కుమార్, హరో ఓం మిశ్రా, నిహారిక గీతాలు ఆలపించారు. బృందావన వారిచే దేవతల వేశాధారణలు ప్రత్యేక ఆకర్షణంగా నిలిచాయి. మహానైవద్యంగా 56 రకాల మిఠాయిలను స్వామివారికి సమర్పించారు. ఈ కార్యక్రమం లో గోషా మహల్ ఎమ్మెల్యే టి.రాజా సింగ్, సినీ నటుడు అమిత్, రాష్ట్ర ప్రచార కమిటీ కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, కార్పొరేటర్ లు శంకర్ యాదవ్, శశికళ కృష్ణ, లాల్ సింగ్, ఓం ప్రకాశ్ బిష్వ , గోవింద్ రాటి, డాక్టర్ భగవంతురావు ,సేవా సమితి ప్రధాన కార్యదర్శి సి రాజన్ కుమార్, ఆర్గనైసింగ్ కార్య దర్శి పి. రంజిత్ కుమార్, సహాకాశాధికారి సచిన్ రాజ్ సింగ్, తోట శ్రవణ్ పాల్గొన్నారు.

సంగీత, నృత్యాలతో శివాభిషేకం

మహాశివరాత్రిని పురస్కరించుకొని స్వరభారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శివాలయంలో ఏర్పాటు చేసిన సంగీత నృత్య ప్రదర్శన శివోహం కార్యక్రమం నిర్విరామంగా ఎనిమిది గంటల పాటు కొనసాగింది. సంగీత, నృత్య, వాద్య కళలలు తదితర ప్రదర్శనలతో కన్నుల పండువగా నిర్వహించారు. శివునికి స్వర, నాదాలతో నాట్యాభిషేకం చేసి ఫౌండర్ గాడిపెల్లి శ్రీనివాస్ కృషిని వక్తలు రాధాకుమారి, ప్రొఫెసర్ డాక్టర్ ఆంజనేయులు ప్రశంసించారు.

– తెలుగు యూనివర్సిటీ

విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలి

విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని కార్వాన్ నియోజకవర్గ ఎమ్మెల్యే మమ్మద్ కౌసర్ మొయినుద్దీన్ అన్నారు. గోల్కొండ లోని ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన షాంగ్రిల్లా స్కూల్ వార్షికోత్సవాలలో ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్, కార్పొరేటర్ ఎండి నసీరుద్దీన్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాసంస్థలలో విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించాలని అన్నారు.

– మెహబీపట్నం, ఫిబ్రవరి 27

బీసీల రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాలి

కాచిగూడ, ఫిబ్రవరి 27: కేంద్ర ప్రభుత్వం జనాభా దామాషా ప్రకారం తక్షణమే బీసీలకు రిజర్వేషన్లను కల్పించడానికి పార్లమెంటులో రాజ్యాంగ సవరణ చేయాలని జాతీయ బీసీ దళ్‌అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి డిమాండ్ చేశారు. గురువారం కాచిగూడలో బీసీ సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో కుమారస్వామి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా కులగనన నిర్వహించినప్పుడే బీసీల సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. బీసీల ఆకాంక్షలను నెరవేర్చడంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. బీసీ ఉద్యమాన్ని త్వరలో ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కుల గణనపై బీజేపీ మంత్రులు, ఎంపీలు, సీనియర్ నాయకులు, ప్రధాని మోదీపై ఒత్తిడి తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి